'విజయం' వరించినప్పుడు సంబురాలు చేసుకోవడం మంచిదే! కానీ, ఓటమి పాఠాలు నేర్చుకోవడం అంతకంటే ముఖ్యం' అంటాడు మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు, వితరణ శీలి బిల్ గేట్స్. విజయవంతమైన ఏ వ్యక్తి కథయినా సాదాసీదాగా సాగిపోదు. అందులో వాళ్లు ఎదుర్కొన్న అవమానాలు, గాయాలు, కష్టాలు, వేదన, మానసికంగా నలిగిపోవటాలు.. ఇలా ఎన్నెన్నో అనుభవాలు కనిపిస్తాయి. జీవితంలో ఎదురైన పరాజయాలే తమకు అద్భుతమైన తెలివితేటలు నేర్పాయనీ, తర్వాత ప్రయాణంలో తారసపడిన ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనే శక్తియుక్తులు ఇచ్చాయనీ విజేతల మాట! ఉలి దెబ్బలు ఓర్చుకున్న శిల.. అందమైన శిల్పంగా మారినట్టు, ఓటమి నేర్పిన పాఠాలు.. మనిషిని ఉన్నతుడిగా, అజేయుడిగా నిలబెడతాయన్నమాట! ఏదో ఒక రూపంలో ప్రతిఘటన ఎదురుకాకపోతే.. జీవితంలో మజా రాదు. ఎన్నో కోతలకు గురైతే గానీ వజ్రం విలువ పెరగదు! తీవ్రమైన యాతనలు ఎదురైనా తట్టుకున్నప్పుడే మన విలువ అపరిమితంగా పెరుగుతున్నది సత్యం.




**ఏది విజయం? ఏది అపజయం?**

పరీక్షల్లో తక్కువ గ్రేడ్ రావడం, పరీక్ష తప్పటం, ఇంటర్వ్యూకి పిలుపు రాకపోవడం, వచ్చినా ఉద్యోగం పొందలేకపోవడం, వృత్తివ్యాపారాల్లో ఎదురీతలు, కష్టానికి తగిన ప్రతిఫలం పొందకపోవడం, జీవితంలో అగచాట్లు.. ఇవన్నీ వైఫల్యాలు అనుకోవచ్చు. ప్రఖ్యాత విశ్వవిద్యాలయంలో సీటు రావడం, క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో భారీ వేతనంతో ఉద్యోగం పొందడం, కెరీర్‌లో ఊహించనంతగా ఎదగడం, సవాళ్లు ఎదురైనా మీ నిజాయతీని కాపాడుకోవడం, కీర్తి ప్రతిష్ఠలు పొందడం, అందరి ఆదరాభిమానాలు సంపాదించడం, మరిన్ని అవకాశాలను అందుకోవడం ఇవన్నీ గెలుపుబాటలో మైలురాళ్లుగా చెప్పుకోవచ్చు.

వైఫల్యం వచ్చినంత మాత్రాన జీవితం ముగిసినట్టు కాదు. ఒక్క విజయంతో అన్నీ సాధించానని అనుకోవడం ఎలా తప్పో.. ఒక్క అపజయంతో అన్నీ కోల్పోయానని కుంగిపోవడమూ సమంజసం కాదు. అయితే ఓటమి మొదట నిరాశకు గురిచేస్తుంది. అయినవారు కూడా చులకనగా చూస్తారన్న భావన కలిగిస్తుంది. ఆ ఆవేదనలోనే కూరుకుపోతే బతుకు పరుగు అక్కడితో ఆగిపోతుంది. లోతుగా ఆలోచిస్తే.. ప్రతి ఓటమీ ఓ అద్భుతమైన పాఠం చెబుతుంది. మిమ్మల్ని ఆలోచింపజేస్తుంది. పరిస్థితులను అవలోకనం చేసుకోమని బోధ చేస్తుంది. అందుకు తగ్గట్టుగా మిమ్మల్ని మీరు తీర్చిదిద్దుకోవాలని హెచ్చరిస్తుంది. ఉదాహరణకు ఒకసారి బ్రేక్ దెబ్బతిని బైక్ పైనుంచి పడిపోయామని అనుకోండి. ఆ తర్వాత నుంచి బైక్ ఎక్కిన ప్రతిసారీ.. బ్రేకులు సరిగ్గా పడుతున్నాయో లేదో చెక్ చేసుకోవడం అలవాటుగా మారుతుంది. ఇంటి గుమ్మానికి తల కొట్టుకుంటే, ఇకపై జాగ్రత్తగా నడవాలని గ్రహిస్తాం. గుమ్మం దాటిన ప్రతిసారీ.. తెలియకుండానే తలొంచుకుంటాం. ఓటమి నేర్పిన పాఠమే కదా ఇది. అయితే వాటిని గుర్తించి, అందుకు తగ్గట్టుగా నడుచుకుంటేనే ఓటమి మనల్ని గెలుపు తీరాలకు చేరువ చేస్తుంది. లేకపోతే.. జీవితంలో ముందుకు వెళ్లడం అసాధ్యమవుతుంది.

ఓ వ్యక్తి పిండి వ్యాపారం చేసేవాడు. అందులో రాణించలేకపోయాడు. పశ్చిమ గాలులు విపరీతంగా వీయడం వల్ల పిండి గాలికి ఎగిరిపోయేది. మరోవైపు ఉప్పు వ్యాపారం చేసే వ్యక్తి లాభాలు గడించాడు. ఈ విషయం తెలిసిన మొదటి వ్యక్తి మనసు మార్చుకుని తనూ ఉప్పు వ్యాపారం చేద్దామనుకున్నాడు. ఉత్సాహంగా రంగంలోకి దిగాడు. అప్పటికి వర్షకాలం రావటంతో వానకు మొత్తం ఉప్పు కరిగిపోయి వ్యాపారంలో నష్టం వచ్చింది. పనిని ఎంచుకోవటంలో లోపమే ఇక్కడ వైఫల్యానికి కారణం. ఆఫ్రికాలో తమకు మార్కెట్ ఉంటుందో, లేదో తెలుసుకోవాలని ఓ సంస్థ ఇద్దరు సేల్స్‌మెన్‌లను అక్కడికి పంపింది. ఒకరు తూర్పు తీరానికీ, మరొకరు పశ్చిమ తీరానికీ వెళ్లారు. ఇద్దరూ ప్రాథమికంగా సర్వే చేసి తమ నివేదికలను సంస్థ యజమానికి పంపారు. 'ఇక్కడ ఒక్కరు కూడా షూ ధరించటం లేదు. ఇక్కడ అసలు మార్కెట్టే లేదు' అని మొదటి వ్యక్తి తన సర్వే సారాంశాన్ని పేర్కొన్నాడు. రెండో వ్యక్తి అందుకు భిన్నంగా 'ఇక్కడ షూ ధరించే వ్యక్తులు ఎవరూ లేరు. మనకు మార్కెట్ బ్రహ్మాండంగా ఉంటుంది. వెంటనే ఇన్వెంటరీ పంపండి' అన్నాడు. మనం చూసే దృష్టి కోణాన్ని బట్టి పరిస్థితులు ఉంటాయి! ఇద్దరిలో ఒకరు ఇక్కడ పరిస్థితులు మార్చలేమని భావిస్తే, మరొకరు అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని గుర్తించాడు. గెలుపు, ఓటమి సహజం అనే వైఖరి ఉన్నవాళ్లు మొదటి రకం సాధారణ మనుషులు.



ప్రతికూల పరిస్థితుల్లోనూ అనుకూలతను దర్శించగలిగిన వాడు రెండో వ్యక్తి తరహా మనిషన్నమాట! 'వైఫల్యం అంటే నేర్చుకోవడంలో తొలి ప్రయత్నం' అంటారు ఏపీజే అబ్దుల్ కలాం. ఓడిపోతామన్న భయం మనిషిని గెలుపునకు దూరం చేస్తుంది. అదే ఓటమిని స్వీకరించగల నైతిక స్థైర్యం ఉంటే.. గెలుపు బావుటా ఎగురవేయడం పెద్ద కష్టమేం కాదనిపిస్తుంది.

**ఓటమి అంటే..**

- వైఫల్యం వచ్చిందంటే మీరు ఓడిపోయినట్టు కాదు. విజయం కోసం మీరు తాపత్రయపడుతున్నారని! విజయం వరించలేకపోవడానికి కారణాలు అనేకం ఉంటాయి. మీరు పనిచేసే విధానంలో ఏదో లోపం ఉండొచ్చు. విజయాన్ని అందుకునేంత శక్తిసామర్థ్యాలను, సమయాన్ని వెచ్చించి ఉండకపోవచ్చు. అంత మాత్రానికే.. 'మనతో కాదు' అని తోకముడిస్తే గెలుపు అందని ద్రాక్షగానే మిగిలిపోతుంది. మరో రకంగా ప్రయత్నించి చూడండి! మరింత సమయం వెచ్చించండి. మరింత లోతుగా అర్థం చేసుకుంటే.. ఓటమి ఎంత ఎరుకతో ఉండాలో చెబుతుంది. ఆ దిశగా ప్రయత్నిస్తే విజయపథం కనిపిస్తుంది. ఉదాహరణకు శాస్త్రవేత్తలు చేసే ప్రతి ప్రయోగం విజయవంతమైతే.. సైన్స్‌లో ఇన్ని ఆవిష్కరణలకు ఆస్కారం ఉండేది కాదేమో! ప్రయోగాల్లో వైఫల్యమైన ప్రతిసారీ వాళ్లు మరో కొత్త ఆవిష్కరణకు నాంది పలికారు. మీ ఆలోచనలను 'రీ డైరెక్ట్' చేసుకోవడం వల్ల.. మరిన్ని ఆప్షన్లు ఎదురవుతాయి. కొత్త మార్గంలో ప్రయాణించగలుగుతారు.
- ఓటమి పాలైనంత మాత్రాన మీరు ఆత్మగౌరవాన్ని కోల్పోయినట్టు కాదు. మళ్లీ కొత్తగా ప్రయత్నించటానికి ధైర్యాన్ని పోగు చేసుకున్నారన్నమాట!! ఒక ఇంటర్వ్యూలో ఎంపిక కానంత మాత్రాన మీరు పనికిమాలిన వాళ్లు కాదని గ్రహించాలి. ఆ అపజయాన్ని స్ఫూర్తిగా తీసుకొని మీ నైపుణ్యాలను నిజాయతీగా విశ్లేషించుకోవాలి. అప్పుడు గతంలో కన్నా గొప్ప అవకాశం మీ తలుపు తడుతుంది.
- ఓడిపోవటం అంటే మీకేదీ మిగలలేదని కాదు. కొత్త దారులలోకి మీరు అడుగుపెట్టవలసిన సమయం వచ్చిందని తెలుసుకోండి. పట్టుదల, ఏకాగ్రతతో ముందుకు వెళ్లండి.
- ఓడిపోవటం అంటే ప్రయత్నాన్ని ఆపేయమని